క్లుప్తంగా

నేడు ఉల్చాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 1వ తేదీన బుధవారం ఉదయం 8 గంటలకు కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.భాస్కర్‌నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. కావున మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

పాణ్యంలో

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని గ్రామ సచివాలయం-2 పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండల స్థాయి అధికారులు తప్పక పాల్గొనాలన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తారన్నారు.

నేడు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

కర్నూలు (న్యూటౌన్): ఫిబ్రవరి 1వ తేదీన బుధవారం కర్నూలు మండలంలోని 25 గ్రామాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేయనున్నట్లు కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్ నాయుడు తెలిపారు. మొత్తం 10,080 మంది లబ్ధిదారులకు రూ.2,81,41,000 నగదును అందజేయనున్నట్లు చెప్పారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

50799.58 ఎకరాల్లో రీ సర్వే

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో 82,632 ఎకరాల భూమి ఉందని, ఇందులో మంగళవారం నాటికి 50799.58 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో భూముల రీ సర్వే పకడ్బందీగా కొనసాగుతోందన్నారు. వీఆర్‌ఓలు, సర్వే సహాయకులు తమకు ఇచ్చిన ఫార్మెట్‌లలో వివరాలు నమోదు చేయాలని సూచించారు.

సుంకేసులకు 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు మంగళవారం 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని, కేసీ కాల్వకు 1,325 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు.

మూల పెద్దమ్మకు పూజలు

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కళకళలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాలు అందించారు.

పునరుత్పాదక విద్యుత్‌దే భవిష్యత్



సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): భవిష్యత్ పునరుత్పాదక విద్యుత్‌దేనని మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువల్ ఎనర్జీ ప్రతినిధులు అరవింద్(సైంటిస్ట్), రాధేశ్యామ్ పేర్కొన్నారు. మంగళవారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు మెగా అల్ట్రా సోలార్ పార్కును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. సోలార్ పవర్, గాలిమరలు ద్వారా కర్నూలులో అత్యధికంగా విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఈ విషయాలను ఫీల్డ్ విజిట్‌ల ద్వారా చూసి ప్రత్యక్ష అనుభూతిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రతినిధులు మురళీకృష్ణారెడ్డి, సురేఖారెడ్డి, ఇంజినీర్లు సత్యానారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

సేవలు విస్తరించండి

సి.బెళగల్: గ్రామ సచివాలయాల సేవలను ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు విస్తరించాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. మంగళవారం ఆయన ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, పోలకల్ గ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. ప్రజల ఇళ్ల వరకు చేర్చాల్సిన సేవలను, సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకు సచివాలయాల ద్వారా చేపట్టాల్సిన అంశాలను మండల అధికారులు వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్, సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేల పురోగతి, ఉద్యోగులపై సూచనలు చేశారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కల్లూరు అర్బన్, పాణ్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మాదిరాజు నగర్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి.



పాణ్యంలోని జీసీ కాలనీలో లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు/పాణ్యం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 35వ వార్డు 91వ వార్డు సచివాలయం పరిధిలోని మాదిరాజు నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రం పాణ్యంలోని సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే... మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రజాప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామని చెప్పారు. కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కల్లూరు 35వ వార్డులో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు (స్టాండింగ్ కమిటీ సభ్యులు) సాన శ్రీనివాసులు, ఇప్పల నారాయణరెడ్డి, 36వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులతో ఎమ్మెల్యే ముచ్చట : గడప గడప కార్యక్రమంలో భాగంగా పాణ్యంలో అంగన్‌వాడీ కేంద్రంలోకి వెళ్లిన ఎమ్మెల్యే కాటసాని పిల్లలతో ముచ్చటించారు. వారికి ఏ ఆహారం అందిస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివస్వాముల విజ్ఞప్తి మేరకు మధ్యాహ్నం చెంచుకాలనీలో నిర్వహించిన శివస్వాముల భిక్ష కార్యక్రమానికి హాజరై వారితో కలిసి భిక్ష చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, పుల్లయ్య, సుబ్బరాయుడు, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, ఆటో మాబు, మహేష్, నాగరాజు, నూర్‌బాష, కృష్ణారెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాణ్యం: మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో సమస్యలను పరిష్కరించాలని ఆర్‌వీఎస్ఏ, ఆర్‌వీఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. సమస్యలపై డీఈఓకు వినతి పత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రనాథ్, ప్రతాప్, వెంకట్, రియాజ్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 19వ వార్డు ఇందిరమ్మ కాలనీలోని నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో మనబడి నాడు-నేడు పథకం కింద మౌలిక వసతులు కల్పించారు. మంగళవారం వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య సహకారంతో కల్లూరు అర్బన్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో శివరాం, రమణ తదితరులు పాల్గొన్నారు

అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి

- అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- మండల మీట్‌లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: అధికారులు ప్రజలకు పూర్తి జవాబుదారీతనంతో పని చేయాలని, అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉసేన్‌బీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా శాఖ అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ... అధికారులు విధుల పట్ల అలసత్వం వహించవద్దన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. తమ్మరాజుపల్లె గ్రామస్తుల ఆకాంక్ష అయిన ఏటిపాయ చెక్‌డ్యామ్‌కు త్వరలోనే భూమి పూజ చేసి నిర్మాణ పనులు వేగంగా చేపట్టి వారి కలను సాకారం చేస్తామన్నారు. మండలంలో చాలా వరకు విద్యుత్ శాఖ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఆ శాఖ అధికారులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే మైనర్‌ఇరిగేష్ అధికారులతో సమీక్షా నిర్వహించి పాణ్యం ఊరుముందరి చెరువు పటిష్టతకు చర్యలు చేపడతామని తెలిపారు. ఆలమూరు, భూపనపాడు, కొలమాకుల బుగ్గకు నీరు తగ్గిన వెంటనే పనులు చేయిస్తామన్నారు. ఉపాధి పథకం ద్వారా ముందుగా ఎస్సార్బీసీ కాల్వలను శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. మండలానికి సోలార్, మైనింగ్ నిధుల కింద రూ. 4 కోట్ల మేర మంజూరు చేశామని, మరో 10 రోజుల్లో ఈ పనులు ప్రారంభించకుంటే నిధులు బ్లాక్ అవుతాయన్నారు. కావున ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పనులు చేపట్టాలన్నారు. కందికాయపల్లె, ఆలమూరు గ్రామాల్లో కూడా గ్రీన్‌కో సోలార్‌కు సర్వే చేస్తున్నట్లు చెప్పారు.

పశు అంబులెన్స్‌లను సద్వినియోగం చేసుకోండి: పాడి రైతుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు. పశువులకు ఆరోగ్య సమస్యలొస్తే 1962 కాల్ చేయాలని, కొన్ని నిమిషాల వ్యవధిలోనే అంబులెన్స్ రైతుల వద్దకు చేరుకుంటుందన్నారు. పాడి రైతులు ఈ అంబులెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా నూతనంగా వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. మండలంలో నూతనంగా మంజూరైన ఇళ్ల స్థలాలు, గృహాల పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందించారు. కొత్తగా 512 మందికి గృహాలు, 20 మందికి ఇళ్ల పట్టాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎంపీడీఓ దస్తగిరి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, పశుసంవర్ధశాఖ ఏడీ కమలాకర్, పాణ్యం సర్పంచ్ మేలక పల్లవి, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, బాబు, రాజన్న, ప్రతాప్‌రెడ్డి, బాలిరెడ్డి, కృష్ణారెడ్డి, పుల్లయ్య, ఉసేన్‌సా తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో భక్తుల సందడి,(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

కర్నూలు (న్యూటౌన్): కోరిన కోర్కెలను తీర్చే వెంకాయపల్లె ఎల్లమ్మతల్లికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. కల్లూరు మండలం పందిపాడు గ్రామానికి చెందిన బి.ఈశ్వరయ్య, మస్తానమ్మ దంపతులు 2 తులాల బంగారు నెక్లెస్‌ను అమ్మవారికి అందించారు. అదేవిధంగా ఎవరెస్ట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యజమాని మద్దిలేటి స్వామి 15 గ్రాముల బంగారు నల్లపూసల దండ, వెంకాయపల్లెకు చెందిన పాలపల్లి మల్లికార్జున, నాగమ్మలు కలిసి అరకేజీ వెండి నాగ పడిగె అమ్మవారికి బహూకరించారు. ఎల్లమ్మతల్లి ఆలయానికి జిల్లాతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 5 గంటలకు ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధద్రవ్యాల అభిషేకం, కుంకుమార్చన నిర్వహించి పట్టువస్త్రాలు, పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వధూవరులు, ఉద్యోగం పొందిన వారు, ఇంకా ఇతర మొక్కులు తీరిన వారు ఎల్లమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కల్లూరు సింగిల్‌విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మతల్లికి బంగారు ఆభరణాలు బహూకరిస్తున్న పందిపాడు భక్తులు

20 నాటికి శనగ కొనుగోలు కేంద్రాలు



ప్యాలకుర్తి ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఫిబ్రవరి 20నాటికి కోడుమూరులో శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. మంగళవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ఆయన పర్యటించి రబీ కింద రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశమై పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై చర్చించారు. ప్రభుత్వం ఫిబ్రవరి 20లోగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరపై క్వింటాలు శనగలను రూ.5380ల చొప్పున కొనుగోలు చేస్తుందని, రైతులెవ్వరు తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకోవద్దని సూచించారు. అనంతరం వేరుశనగ పంటను పరిశీలించారు. ప్రస్తుతం వేరుశనగకు లద్దెపురుగు, పచ్చపురుగు ఆశిస్తోందని తెలిపారు. లద్దెపురుగు, పచ్చ పురుగు నివారణకు నివలురాన్ ఎకరాకి 250ఎంఎల్, ఇమామెక్టిన్ బెంజోయేట్ 250గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. అలాగే ఎకరానికి 10కిలోల తవుడు, 5కిలోల బెల్లం, 500ఎంఎల్ క్లోరిఫైర్పాస్ లేదా క్వినాల్‌పాస్ కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలన్నారు. మచ్చ తెగులు నివారణకు గ్లైటాక్స్ 600గ్రాములు ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

సస్య రక్షణ చర్యలు చేపటాలి

కల్లూరు: రైతులు సాగు చేసిన పంటలలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తడకనపల్లె గ్రామంలో క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన పొగాకు, సోయా చిక్కుడు, జామతోట మొదలగు పంటలను పరిశీలించారు. ఆయా పంటలు సాగు చేసిన రైతులకు పంటలకు వేయవలసిన ఎరువులు, మందులను వివరించారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన



లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- సంతోష్ నగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 40వ వార్డు సంతోష్ నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని, పరిష్కరించేందుకే మీ వద్దకు వచ్చానని తెలిపారు. సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో అందిస్తున్నారా ? లేదా అని ప్రజలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ నాయకులు, ఆ పార్టీ సానుభూతిపరులకే పథకాలు అందేవని, ప్రస్తుతం పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను వలంటీర్ల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్లు శేషన్న, ఖాజాబీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి



గని గ్రామంలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ సుబ్బారెడ్డి తదితరులు

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గడివేములతో పాటు కొర్రపాలూరు, గని గ్రామాల్లోని జగనన్న లే అవుట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా సచివాలయాలల్లో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. బిల్లులను ఎప్పటికప్పుడు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయసింహారెడ్డి, హౌసింగ్ ఏఈ మూర్తి, ఈఓపీఆర్‌డీ అబ్దుల్ ఖాలీక్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం భవితా కేంద్రం ద్వారా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ అనంతయ్య సూచించారు. మంగళవారం కోడుమూరు కొండపేట ప్రాథమిక పాఠశాలలోని భవితా కేంద్రాన్ని ఎంఈఓ తనిఖీ చేసి ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఫిజియోథెరపిస్టు అమూల్య చేస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం భవితా కేంద్రంలో ఉచితంగా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎ లక్ష్మన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భవితా కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలను పరిశీలిస్తున్న ఎంఈఓ అనంతయ్య

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



ప్యాలకుర్తిలో సిటిజన్ ఔట్ రీచ్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు, లబ్ధిదారులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆదేశించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో జరుగుతున్న సిటిజన్ అవుట్ రీచ్ సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఔట్ రీచ్‌లో భాగంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధి పొందుతున్న విధానాలపై ప్రజలకు వివరించడంతో పాటు, సేవల్లో కలుగుతున్న అసౌకర్యాలను నమోదు చేసుకోవాలన్నారు. అర్హతలుండి ఎవ్వరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే అలాంటి వారి జాబితాను తన దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎంపీడీఓ ప్యాలకుర్తి గ్రామ సచివాలయం-1,2లను ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయ రికార్డులను, సంక్షేమ పథకాల అమలు తీరు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రతిరోజు సిబ్బంది సచివాలయంలో అందుబాటులో ఉండాలని, స్పందన నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించాలన్నారు.

వైభవంగా మిన్నెల్లస్వామి కిస్తీ వేడుకలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పొన్నకల్‌లో కొలువైన అయ్యకొండ మిన్నెల్లస్వామి కిస్తీ(జియారత్) వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు జరిగిన కిస్తీ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను కిస్తీ బండ్లలో తీసుకువచ్చారు. మిన్నెల్లస్వామికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను అందించి దర్గా ముందు ఉన్న గుండంలో కిస్తీ ప్రసాదాన్ని వేయగా తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. అనంతరం దర్గాలో భక్తులు ప్రార్థనలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి సౌకర్యం లేకుండా ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును నిర్వహించారు. కిస్తీ వేడుకలకు వచ్చిన భక్తులకు దాహం తీర్చేందుకు మాజీ జెడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ బజారి, విజయుడు, ప్రకాష్‌గౌడ్, వెంకటనరహరి,శంకర్ పాల్గొన్నారు.



కిస్తీ ప్రసాదం కోసం ఎగబడిన భక్తులు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

- నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు



లేఅవుట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు

గడివేముల: అర్హత ఉన్న వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో నూతనంగా జగనన్న లే అవుట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. గ్రామంలో 65 మందికి ఇళ్లస్థలాలు త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శిరుప శ్రీనివాసరెడ్డి, ఎల్లారెడ్డి, వీఆర్వో హరీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎర్రదొడ్డిలో ఘనంగా దేవర



సుంకులమ్మకు పూజలు చేసేందుకు పూర్ణకుంభాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

కోడుమూరు రూరల్: మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో మంగళవారం శ్రీసుంకులమ్మ దేవర ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. సుమారు 70 సంవత్సరాల తర్వాత దేవరను నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి పూర్ణకుంభంతో వెళ్లి సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. దేవర ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా కోడుమూరు ఎస్ఐ విష్ణునారాయణ తన సిబ్బందితో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

పరిశుభ్రత పాటించాలి

సి.బెళగల్: హాస్టల్ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సి.బెళగల్ పీహెచ్‌సీ ఏఎన్ఎం పుష్పలత అన్నారు. మంగళవారం సాయంకాలం మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు రంగమ్మ, ఉషారాణి, లత, మార్థమ్మ, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.